

ఈడీ అధికారులపై ఎఫ్ఐఆర్ కొట్టివేత

బెంగళూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతికి సంబంధించి విచారణ జరుపుతున్న ఈడీ అధికారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు ధర్మాసనం శుక్రవారం కొట్టేసింది. వాల్మీకి కార్పొరేషన్ అధికారి కళ్కేశ్, ఈడీ అధికారులు ఇద్దరూ అవినీతిలో సీఎం సిద్ధరామయ్యకు భాగం ఉందని చెప్పాలంటూ ఒత్తిడి చేస్తున్నారని విల్సన్‌గార్డెన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఈడీ డిప్యూటీ డైరెక్టర్ మనోజ్ మిత్తల్, మరో అధికారి మురళి కణ్ణన్ కోర్టును ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ ధర్మాసనం తీర్పునిచ్చింది.



ఖజానా ఖాళీ



- ఆదాయమే కాదు... ఖర్చులూ పెరిగాయి
- ఖజానాకు భారంగా గ్యారెంటీలు, పథకాలు
- నిధులు సమకూర్చడమే ప్రతిష్ఠాత్మకం

బెంగళూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఆదాయమే కాదు ఖర్చులూ పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్నుయేతర ఆదాయం 1.96 లక్షల కోట్ల రూపాయలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక సంవత్సరంలో కీలకమైన మొదటి ఏడు నెలలకు గాను 53శాతం ఆదాయాన్ని సేకరించడంలో విజయంతమయ్యారు. అయితే ఏటా తప్పనిసరి ఖర్చులు పెరుగుతుండడంతో గ్యారెంటీలను అమలు చేసే విషయంలో కట్టుబడి ఉండడంలో ప్రభుత్వం సతమతమవుతోంది. నిధులు సమకూర్చుకునేందుకు ప్రత్యామ్నాయంగా రుణాలవైపు దృష్టి సారించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పింఛన్లతోపాటు ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న అప్పులపై వడ్డీలు చెల్లించేందుకు రూ.31,362 కోట్లు భరించాల్సి వస్తోంది. తప్పనిసరి ఖర్చులకు ప్రస్తుత ఏడాది 1.52 లక్షల కోట్లు రూపాయలు వెచ్చించాల్సి ఉంది. ఇలా ఆర్థిక సంవత్సరం ముగింపులోగానే అప్పులు పెరిగే అవకాశం ఉంది.

రూ.22,670 కోట్ల అదనపు భారం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా వేతనాలు, గ్యారంటీలతో పాటు ఇతరత్రా గ్రాంట్లు లాంటి ప్రణాళికా ఖర్చులకు నిధులు సమకూర్చడం అనివార్యం కానుంది. వేతనాలు, పింఛన్ల ఖర్చు రూ.22,670 కోట్లకు పెరిగింది. వేతనాలు, పింఛన్లు, రుణాలపై వడ్డీ కోసమే 1,53,023 కోట్లు రూపాయలు ఖర్చు కానుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రణాళికా ఖర్చులు భారీగా పెరిగాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ఏడో వేతన కమిషన్ సిఫారసు అమలు చేసిన క్రమంలో వేతనాలు, పింఛన్ల భారం పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే రూ.22,670 కోట్లు అదనపు భారమైంది.

2023-24 వరకు రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.5,67,751 కోట్లుగా ఉండేవి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోగా 1,05,246 కోట్ల రూపాయలు రుణం తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు 6,57,588 కోట్ల రూపాయలకు చేరనుంది. 2023-24లో వేతనాలకు రూ.65,003 కోట్లు ఖర్చు కాగా ప్రస్తుతం రూ.80,434 కోట్లు, పింఛన్లకు గత ఏడాది 25,116, ప్రస్తుతం 32,355 కోట్లు అయ్యింది. ఇక రుణాలపై వడ్డీలు గత ఏడాది రూ.30,543 కోట్లు, ప్రస్తుతం రూ.39,2345 కోట్లు, సబ్సిడీ, ఆర్థిక ప్రోత్సాహకాలు గత ఏడాది రూ.27,732 కోట్లు, ప్రస్తుతం రూ.25,904 కోట్లు, గ్యారెంటీలకు గత ఏడాది రూ.33,468 కోట్లు, ప్రస్తుతం 52,009 కోట్లుగా ఉంది. సామాజిక భద్రతా పింఛన్లు గత ఏడాది రూ.10,822 కోట్లు, ప్రస్తుతం రూ.10,230 కోట్ల అంచనాలు ఉన్నాయి. వీటిలో మార్పులు జరిగే అవకాశం ఉంది.

రుణాలపై దృష్టి సారింపు

ఏటా బడ్జెట్‌కు అనుగుణంగా ఆదాయం ఆశించినంత రాకపోవడం, ఖర్చులు పెరగడంతో ప్రత్యామ్నాయ మార్గంగా అప్పులవైపు ప్రభుత్వం దృష్టి సారించింది. 5లక్షల కోట్ల రూపాయలు ఇప్పటికే పన్నులు దాటిపోవడంతో నెలసరి వడ్డీలు కోలుకోలేని రీతిలో దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలకు ఇస్తున్న సబ్సిడీ, ఆర్థిక సహకారం అందించే గ్రాంట్లలో కొంత తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. గత ఏడాదికంటే ప్రస్తుత సంవత్సరం సుమారు 2వేల కోట్లు తగ్గనుంది. సామాజిక భద్రతా పింఛన్లలోనూ 600 కోట్ల దాకా తగ్గుముఖం పట్టవచ్చునని అంచనా వేస్తున్నారు. అయితే రుణ భారం పెరగడం, వచ్చిన ఆదాయంలో వడ్డీలకు అధికంగా కేటాయించాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు గ్యారెంటీ పథకాలు, అప్పులపై చెల్లించే వడ్డీ మోయలేని భారంగా మారి ఖజానాను కొల్లగొడుతోంది.



గత ఏడాది రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఉండడంతో ఆదాయం తగ్గింది. ప్రస్తుత ఏడాది రాష్ట్రమంతటా సుభిక్షంగా ఉంది. పైగా ప్రాజెక్టులు నిండుకుండలా ఉన్నాయి. ఈ పర్యవసానం ప్రభుత్వానికి కలసి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ప్రణాళికా ఖర్చులను ఏ విధంగా నిభాయించాలనేది కూడా కీలకం అవుతోంది. నియోజకవర్గాల అభివృద్ధి గ్రాంట్ల విషయంలో ప్రతిపక్షాల ఎమ్మెల్యేల సంగతి ఎలా ఉన్నా సొంత పార్టీలోనే గ్రాంట్లు అందడం లేదని ఎమ్మెల్యేలు తిరగబడుతున్నారు. ఈ ప్రభావం కూడా ప్రభుత్వంపై ఒత్తిడికి కారణమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యేలందరికీ గ్రాంట్లు విడుదల చేస్తారా..? అనేది చర్చనీయాంశం అవుతోంది. మరికొన్ని రోజుల్లోనే బెళగావిలో జరిగే శాసనసభ శీతాకాల సమావేశాలలో రాష్ట్ర బడ్జెట్‌పై తీవ్రమైన చర్చలు జరిగే అవకాశం ఉంది.

ఏడ్చేవారిని ఎవరు నమ్ముతారు..?

- ఎమ్మెల్యే బాలకృష్ణ వివాదాస్పద వ్యాఖ్యలు



బెంగళూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆడవారిలాగా ఏడ్చేవారిని ఎవరు నమ్ముతారని జేడీఎస్ నేత దేవెగౌడ కుటుంబీకులపై కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా చన్నపట్టణ నియోజకవర్గం చక్కెర గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఏడ్చేవారిని ఎవరైనా నమ్ముతారా..? అన్నారు. ఆడవారిలాగా ఏడుస్తారని, ఏడ్చేవారిని లీడర్‌లు అంటారా..? అన్నారు. అభ్యర్థి సీపీ యోగేశ్వర్‌కు సినిమాలలో కళ్లకు ఏదో పెట్టుకుని ఏడుస్తారు కదా... అలా నీవు ప్రయత్నించు అని సూచించానని అందుకు యోగేశ్వర్ తనకు అటువంటి ఏడుపులు రావని చెప్పారన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ వారు ఏడ్చారని ప్రస్తుతం అభ్యర్థి నిఖిల్ అదే వరుసలో ముందుకు పోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశామని, మేం పురుషులను నమ్ముకోలేదని నోరు జారారు. మేం తల్లులను, ఆడబిడ్డలను నమ్ముకున్నామన్నారు. అంతలోనే సర్దుకుని పురుషులంటే మాకెటువంటి ద్వేషం లేదని, మీరు అసంతృప్తికి లోను కారాదని, మీరు ఓట్లు వేయకపోతే మాకు కష్టమే అన్నారు. అయితే మాకు ఆడబిడ్డల ఆశీర్వాదం ఎక్కువని సర్దిచెప్పారు.

మండిపడ్డ దేవెగౌడ



ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలపై జేడీఎస్ నేత దేవెగౌడ తీవ్రంగా స్పందించారు. కొత్వాల్ శిష్యులకు ఎప్పుడైనా కన్నీరు వస్తుందా..? అంటూ మండిపడ్డారు. డీసీఎం డీకే శివకుమార్‌ను ఉద్దేశించి దేవెగౌడ వ్యాఖ్యానించారు. ఇదే విషయమై గురువారం చన్నపట్టణ ప్రచారసభలో సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ దేవెగౌడ మనవడు నిఖిల్‌కు ఏడ్చేది నేర్పించారని, అందుకే ప్రతి సభలోనూ నిఖిల్ ఏడుస్తుంటారని అన్నారు.

డీసీఎం డీకేకు సుప్రీంకోర్టు నోటీసులు

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆస్తుల కేసులో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు డీసీఎం డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల మేరకు గత బీజేపీ ప్రభుత్వం సీబీఐ ద్వారా దర్యాప్తునకు ఆదేశించింది. సీబీఐ విచారణ కొనసాగుతుండగానే ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. దీనిపై సీబీఐ సుప్రీకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భూయన్ ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. సీబీఐ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపింది. తాజాగా శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం కర్ణాటక ప్రభుత్వంతోపాటు డీసీఎం డీకే శివకుమార్‌లకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. సీబీఐ, బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మేరకు విచారణ జరిపింది. సుప్రీంకోర్టులో తేల్చుకోవాలంటూ సదరు పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో వారు సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబరు 17న యత్నాళ్ దాఖలు చేసిన పిటిషన్‌పై డీసీఎం డీకే శివకుమార్‌కు నోటీసులు జారీ చేసింది. తాజాగా సీబీఐ పిటిషన్‌పై కర్ణాటక ప్రభుత్వంతోపాటు డీకే శివకుమార్‌కూ నోటీసులు జారీ చేశారు.

విద్యార్థులకు విమాన యానం

- బడికి హాజరయితే భలే అవకాశం
- సొంత ఖర్చుతో 17 మందిని విమానంలో టూర్‌కు..
- విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

బెంగళూరు/బళ్లారి గాంధీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఓ ఉపాధ్యాయుడు వినూత్నంగా ఆలోచించి రెండున్నర లక్షల రూపాయలు ఖర్చు చేశారు. బెళగావి జిల్లా సోనట్టి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో 17మంది విద్యార్థులను సొంత ఖర్చులతో విమాన ప్రయాణం చేయించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్ దేవణ్ణవర్ గురువారం బెళగావి నుంచి హైదరాబాద్‌కు విమానంలో తీసుకెళ్లారు. అక్కడ రామోజీ ఫిల్మ్‌సిటీ, చార్మినార్, గోల్కొండ కోట వంటి చారిత్రాత్మక ప్రదేశాలను చూపి తిరిగి బెళగావికి తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలకు వచ్చేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపడం లేదని అందులోనూ ప్రభుత్వ పాఠశాల అంటే మరింత నిర్లక్ష్యం చేస్తున్నారని టీచర్ ప్రకాశ్ వాపోయారు. అందుకే వినూత్నంగా ఆలోచించి రూ.2.50లక్షలు ఖర్చు చేసి 17మంది విద్యార్థులను హైదరాబాద్‌కు తీసుకెళ్లానన్నారు. అక్కడ ఓ మినీ బస్సును ఏర్పాటు చేసుకుని చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శింపచేశానన్నారు. విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారన్నారు. హాజరుపట్టిలో ఆబ్సెంట్‌లు లేకుండా ఉండేవారిని మాత్రమే ఎంపిక చేశామని, అందులో లాటరీ తీసి 17మందిని ఎంపిక చేశామన్నారు. విమాన ప్రయాణం చేసిన విద్యార్థులు తమ అనుభవాలను తోటివారితో, కుటుంబీకులతో ఆనందంగా పంచుకున్నారన్నారు.



సోనట్టి ప్రభుత్వ పాఠశాల



ఎయిర్‌పోర్ట్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

గనుల లూటీకి అవకాశం ఇవ్వద్దు..!

- దోచుకోవడానికే రాజకీయాల్లోకి గాలి జనార్దన్‌రెడ్డి
- సండూరులో సీఎం సిద్దరామయ్య ఫైర్



సండూరు ప్రచారసభలో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

బళ్లారి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇనుప గనులను దోచుకుని కోట్లకు పడగలెత్తిన గాలి జనార్దన్ రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వవద్దని, ప్రజలను మోసం చేయడానికే ఆయన రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం శుక్రవారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన యడియూరప్ప ముఖ్యమంత్రిగా బళ్లారికి రావాలంటే జనార్దన్‌రెడ్డి అనుమతి కావాల్సి వచ్చింది. గాలి జనార్దన్ రెడ్డి బళ్లారిని రిపబ్లిక్ ఆఫ్ బళ్లారిగా అప్పట్లో మార్చాడు. ఇలాంటి వ్యక్తి సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రచారం చేస్తున్నారు. మరోసారి అవకాశం ఇస్తే మోసపోతారని, మీకు చేతులెత్త మొక్కుతున్నాను లూటీ కోరు జనార్దన్‌రెడ్డి మాయమాటలకు మోసపోవద్దు అన్నారు. బన్నిహట్టి, ఏళుబెంచి. దరోజి, కుడుతిని, తోరణగల్లు, వడ్డు గ్రామాల్లో పర్యటించిన ఆయన అభ్యర్థి ఇ. అన్నపూర్ణ తుకారాంకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. అప్పట్లో నేను ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు ' నీకు దమ్ముంటే బళ్లారి రా' అని సవాల్ విసిరారు. సవాల్ ను స్వీకరించి బెంగళూరు నుంచి పాదయాత్రంగా వచ్చానన్నారు. బళ్లారిలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించామన్నారు. అప్పటి నుంచే గాలి జనార్దన్‌రెడ్డి లూటీ వ్యవహారం పతనానికి చేరిందన్నారు. మళ్లీ అబద్ధపు హామీలతో మోసం చేయాలని చూస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడానికి బీజేపీ నాయకులు ఈడీ, సీబీఐలను వినియోగిస్తున్నారన్నారు. నేను ఉన్నంత కాలం బీజేపీకి కర్ణాటకలో అవకాశం వచ్చే ప్రశ్నే లేదన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన రూ. 11,480 వేల కోట్ల వాటా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. సీఎం ప్రసంగించిన ప్రతి సభలోనూ గాలినే టార్గెట్ చేస్తూ విమర్శలు సంధించారు. మంత్రి సంతోష్ లాడ్, రాజశేఖర్ యత్నాల్, ఎమ్మెల్యేలు నారా భరత్ రెడ్డి, గణేష్, మాజీ మంత్రి నాగేంద్ర, ఎంపీ తుకారాం. ఎమ్మెల్యే అభ్యర్థి ఇ. అన్నపూర్ణ, ఆంజనేయులు మాట్లాడారు. బీజేపీని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చారని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వీరితో పాటు నాయకులు. బుడా అధ్యక్షుడు జే.ఎస్ ఆంజనేయులు, కాంద్రా సతీష్, వెంకటేశ్ హేగ్డే, వివిద గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జైలుకెళ్లడం ఖాయం..!

- ఆయన అక్రమాల గుట్టు రట్టయ్యింది
- అవినీతి సొమ్ముతోనే ఎన్నికలకు..
- మాజీ సీఎం యడియూరప్ప



మాట్లాడుతున్న మాజీ సీఎం యడియూరప్ప, పక్కన బంగారు హనుమంత, గాలి


బళ్లారి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్ధరామయ్య అక్రమాల గుట్టు రట్టయ్యిందని, ఆయన జైలుకెళ్లడం ఖాయమని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప జోస్యం చెప్పారు. శుక్రవారం సండూరు ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన తాలూకాలోని గొల్లలింగమ్మనహళ్లి, బొమ్మగట్ట, చోరనూరు, హె.కే హళ్లి, తదితర గ్రామాల్లో అభ్యర్థి బంగారు హనుమంత, గాలి జనార్దన్‌రెడి తదితరులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, సీఎం సిద్ధరామయ్య ముడా కేసు, ఎస్టీ నిగమ మండలిలో రూ.189 కోట్లు దోచుకోవడం తదితర అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఉప ఎన్నికల తర్వాత ఆయన జైలుకెళ్లడం ఖాయమన్నారు. ఈడీ వద్ద అన్ని ఆధారాలున్నాయన్నారు. సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వ డబ్బులు, ఇతరులతో వసూలు చేసిన డబ్బుతో ఎన్నికలు జరుపుతున్నారన్నారు. జాతి, కులాల మధ్య వైర్యం పెంచుతున్నారని, నోటీసులు పేరుతో రైతులను బలి తీసుకుంటున్నారన్నారు. వక్ఫ్ భూముల పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. బీజేపీ అధికారంలో రాష్ట్రం అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. మోదీ ప్రధాని అయ్యాక దేశం ప్రశాంతంగా ఉందని అలాగే అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

బీజేపీ నాయకుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం సిద్ధరామయ్య తను చేసిన అభివృద్ధి పనులు చెప్పడం మానుకొని, తనపై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి లోకాయుక్త విచారణలో చేయి కట్టుకుని నిలబడిన ఆయన తన గురించి మాట్లాడడం ఎంత వరకు నీతో చెప్పాలన్నారు. బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ గెలుపుతోనే సండూరు అభివృద్ధి సాధ్యమన్నారు. వీరితో పాటు తెలంగాణా బీజేపీ నాయకుడు సుధాకర్ రెడ్డి, సునీల్ కుమార్, రేణుకారాధ్య , మాజీ మంత్రి శ్రీరాములు, దివాకర్, బైరతి బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అదృష్టం వరించింది..!

వరి రైతుకు ఈసారి అదృష్టం వరించింది. సిరుగుప్ప తాలుకాలోని పలు గ్రామాల్లో రెండు రోజుల నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. తుంగభద్ర పరీవాహక గ్రామాలైన వినాయక నగర్ క్యాంపు, నడివి, నిట్టూరు, దేశనూరు గ్రామాల్లో ఈ సారి విరివిగా వరి సాగు చేశారు. యేడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో దిగుబడి ఆశాజనకంగా ఉందని, ఎకరాకు 50 బస్తాలకు పైగా వచ్చిందిని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండవ పంటకు కూడా సాగునీరు అందటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- సిరుగుప్ప



నిట్టూరులో కోత కోసి ఆరబెట్టిన వరి పంట

హావేరి రైతు ఆత్మహత్యకు వక్ఫ్ నోటీసు కారణం కాదు

- ఎంపీ తేజస్వి సూర్యపై కేసు నమోదు చేస్తాం: ఎస్పీ

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లా హరళగి గ్రామానికి చెందిన రైతు రుద్రప్ప ఆత్మహత్యకు వక్ఫ్ నోటీసులు కారణం కాదని ఎస్పీ అన్షుకుమార్ తెలిపారు. హావేరిలో ఎస్పీ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. గడిచిన రెండేళ్లుగా రుద్రప్ప పంటలసాగుతో నష్టపోయాడని, ఇదే కారణంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఆయన భూమి వక్ఫ్‌కు చెందినదిగా నోటీసులు ఇచ్చారనే వదంతులు వచ్చాయని, బెంగళూర ఎంపీ తేజస్వి సూర్య ఇదే విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారని తెలిపారు. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగేలా ఎవరూ వ్యవహరించరాదని సూచించారు. అసత్య ప్రచారాలపై చర్యలు తప్పవన్నారు.

వంద రోజులుగా కేఆర్ఎస్ కళకళ

బెంగళూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధంగా మండ్య జిల్లాలోని ప్రధానమైన కృష్ణరాజసాగర్ (కేఆర్ఎస్) జలాశయం ఆరునెలల క్రితం దాకా వెలవెలబోయింది. నైరుతి రుతుపవనాల ప్రారంభం నుంచి కావేరి తీరంతోపాటు ఎగువన ఉండే కేరళ రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఇటీవల కొన్నేళ్లుగా పరిశీలిస్తే వందరోజులపాటు పూర్తిస్థాయిలో నీరు ఉండేలా రికార్డు పొందింది. గత ఏడాది నవంబరులో జలాశయంలో నీరు లేక పోయింది. ప్రస్తుత నవంబరులోనూ ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ప్రాజెక్టు తొణికిసలాడుతోంది. జూలైలో కొడగులో భారీ వర్షం కురవడంతో జలాశయం నిండింది. జూలై 24నాటికే కేఆర్ఎస్ నిండిన విషయం తెలిసిందే. అక్టోబరు చివరిదాకా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. నవంబరులోనూ రెండు మూడు రోజులపాటు వర్షం కురిసింది. గత ఏడాది నవంబరులో 22.34 టీఎంసీలు ఉండేది. ఇన్‌ఫ్లో వెయ్యి క్యూసెక్కులు, అవుట్‌లో 3వేల క్యూసెక్కులుగా ఉండేది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 124.80 అడుగులు కాగా 49.45 టీఎంసీల సామర్థ్యంగా ఉండేది. ఇటీవల వంద రోజులుగా కేఆర్ఎస్ పూర్తిస్థాయిలో నిండుకుండలా ఉంది. శుక్రవారం ఉదయం పరిశీలన ప్రకారం 6,988 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కాగా 6,777 క్యూసెక్కులను నదితోపాటు కాలువలకు వదులుతున్నారు.



కేఆర్ఎస్ డ్యామ్

అక్రమాలకు పెద్దన్న..!

- అప్పుడు.. ఇప్పుడు.. ఆయనదే హవా..!
- పది సెంట్ల స్థలం ఆక్రమణ
- ఆరు సెంట్లలో ఇంటి నిర్మాణం
- లెక్కలేనన్ని ఇతరుల ప్లాట్ల అమ్మకం
- మటన్ మార్కెట్‌లో ఇష్టారాజ్యం

అతను వైసీపీ నాయకుడు. రాష్ట్రంలో ఆయన పార్టీ అధికారం కోల్పోయినా ఇక్కడ ఆయన హవా ఎంత మాత్రం తగ్గలేదు. ఆయన చెప్పిందే వేదం. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయన ఆగడాలకు అడ్డేలేకుండా పోయింది. ఆయన ఉంటున్న కాలనీలో అంత తన ఇష్టానుసారమే జరిగింది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసి, అమ్మేశాడు. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో ఆయన కొంతమంది చోటా నాయకులతో కలిసి అధికార పార్టీ ప్రజాప్రతినిధి కుటుంబసభ్యుడిని కలిశాడు. దీంతో ఆయన హవా ఎప్పటిలానే సాగుతోంది. ఇది చూసిన వారంతా అప్పుడు.. ఇప్పుడు ఆయనదే హవా అనేస్తున్నారు. ఇదంతా జరుగుతోంది మరెక్కడో కాదు..రూరల్ మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ పరిధిలోని మటన్ మార్కెట్‌లోనే. - అనంతపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)


చిన్నంపల్లి పంచాయతీలోని మటన్ మార్కెట్

ఆక్రమించి.. ఇల్లు కట్టేసి..

ఆ వైసీపీ నాయకుడు మటన్ మార్కెట్‌లోకి వచ్చినప్పుడు పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. స్థానికంగా బాడుగ ఇంట్లో ఉంటూ పనులు చేసుకునేవాడు. అయితే అప్పటి ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల అండతో నాయకుడి అవతారం ఎత్తాడు. స్థానికులను బెదిరించాడు. టీడీపీ, ఇతరులకు కేటాయించిన స్థలాలను ఒక్కొక్కటిగా ఆక్రమించేశాడు. అలా పది సెంట్లు ఆక్రమించేశాడు. అందులోని ఆరు సెంట్లలో అన్ని హంగులతో పెద్ద ఇంటిని కూడా నిర్మించాడు. స్థానికంగా ఇతరులకు కేటాయించిన స్థలాలు ఒక్కొక్కటిగా అమ్మేశాడు. ఇలా అమ్మిన ప్లాట్ల సంఖ్య పెద్దదిగానే ఉంది. ఒక్కో ఖాళీ స్థలాన్ని రూ.లక్ష మొదలుకుని రూ.3లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఆ సొమ్మునే ఇంటి నిర్మాణానికి పెట్టుబడి పెట్టాడు. స్థానికంగా ఎవరైనా ఇళ్లు కట్టుకోవాలన్నా ఆయన అనుమతి తీసుకోవడంతోపాటు, మామూళ్లు ఇచ్చుకోవాల్సిందేననే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారిన తరువాతైనా స్థానికంగా పరిస్థితి మారుతుందని అందరూ అనుకున్నారు. ప్రభుత్వం మారింది. అయినా ఆ నాయకుడి హవా మాత్రం తగ్గకపోవడంతో నిర్వేదం చెందుతున్నారు.


ఇతరుల స్థలాలను ఆక్రమించి వైసీపీ నాయకుడు కట్టిన ఇల్లు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ఇతరులకు సంబంధించి ప్లాట్లను ఇష్టారాజ్యంగా విక్రయించి సొమ్ము చేసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోని పరిస్థితి. అటూ వైపు తొంగిచూసిన దాఖలాలే లేవు. దీనికి తోడు అప్పటి రెవెన్యూ ఉద్యోగులు ఆ నాయకుడికి బాగా సహకరించినట్లు సమాచారం. సాధారణంగా ఎవరికైనా సెంటు భూమి ఇవ్వాలంటే రెవెన్యూ అధికారులకు సవాలక్ష నిబంధనలు అడ్డొస్తాయి. అలాంటిది పది సెంట్లు ఇతరులకు ప్రభుత్వం కేటాయించగా ఆ స్థలాలను ఆక్రమించి ఇల్లు కట్టుకున్నా పట్టించుకోవడం లేదు. వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆ నాయకుడి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది అనుకుంటే లోపాయికారిగా అధికార పార్టీ నాయకుల అభయం పొంది యథావిధిగా తన పని చేసుకుపోతున్నట్లు సమాచారం.

నిబంధనలు అందరికీ ఒక్కటే..



రెవెన్యూ నిబంధనలు అందరికి ఒక్కటే. ఒక్కొక్కరికి ఒక్కోలా ఉండవు. వైసీపీ నాయకుడు ఆరు సెంట్లలో ఇల్లు కట్టుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం. భూ ఆక్రమణ విషయంలో ప్రస్తుతం ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొస్తోంది. ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.

- మోహన్‌కుమార్, తహసీల్దార్

న్యూస్ బాక్స్

నేడు పీఎం సూర్యఘర్ మేళా


సంపత్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు వినియోగదారుల కోసం శనివారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలోని ఆవరణలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా సంబంధిత విద్యుత్తు అధికారులు, వెండర్లు, ఎస్‌బీఐ, యూనియన్, బ్యాంక్‌ఆఫ్‌బరోడా, ఇండియన్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకుల అధికారులు వారి శాఖల వారిగా స్టాల్స్ ఏర్పాటు చేస్తారన్నారు. ఇంటి పై కప్పు మీద సోలార్ పలకల ఏర్పాటుకు సబ్సిడీతో రుణాలు ఇస్తారన్నారు. రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం వలన విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చునన్నారు. ఇంటి వినియోగానికి పోగా మిగులు కరెంటును విక్రయించుకునేందుకు వీలుంటుందన్నారు. వినియోగదారులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు ఈనెల 10న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురుస్వామి తెలిపారు. జిల్లా స్థాయి సబ్‌జూనియర్ తైక్వాండో బాల, బాలికల కేటగిరిలలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. 7-14 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారులు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి ప్రకాశం జిల్లా కందుకూరులో నిర్వహించే 38వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9110556525ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ, పీడీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఈనెల 7న ఉంగుటూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-14 బాల, బాలికల అథ్లెటిక్ పోటీల్లో జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో జిల్లాకు చెందిన వర్షిత, సుప్రియ, స్ఫూర్తి, లిఖితారెడ్డి పతకాలు సాధించారు. బాలుర విభాగంలో మౌలాలీ, దిలీప్, సాయికిరణ్, రవితేజ, నవీన్‌కుమార్‌లు పతకాలు సాధించిన వారిలో ఉన్నారు. విజేతలను శుక్రవారం స్థానిక ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, పీడీలు వేణుగోపాల్, ప్రసాద్, చల్లా ఓబుళేసు, అథ్లెటిక్ కోచ్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

1న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు డిసెంబరు 1న జిల్లా కేంద్రంలోని రామచంద్రనగర్ సెయింట్ అగస్టీన్స్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రవిరాజు తెలిపారు. అండర్-8, 10, 12, 14 బాల, బాలికలకు కేటగిరిలలో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వివరాలకు 9966333414 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు జేఎన్‌టీయూ విద్యార్థులు


విద్యార్థులను అభినందస్తున్న వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం సెంట్రల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రీ రిపబ్లికడే పరేడ్‌కు జేఎన్‌టీయూ విద్యార్థులు ఎంపికైనట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య శుక్రవారం అభినందించారు. ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో పదిరోజులపాటు నిర్వహించే పరేడ్‌కు విద్యార్థులు వెంకటేష్ నాయక్, నందిత ఎంపికవడం అభినందనీయమన్నారు.

వైద్యసేవకే తొలి ప్రాధాన్యం

- వృత్తిని బాధ్యతగా నిర్వర్తించండి
- వర్క్‌షాపులను సద్వినియోగం చేసుకోవాలి
- చిన్నపిల్లల డాక్టర్ల వర్క్‌షాపులో కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'నేను తొలుత డాక్టర్. ఇపుడు ఐఏఎస్ అధికారిని. అయినా నా తొలి ప్రాధాన్యం వైద్యానికే. నేను ఏస్థాయిలో ఉన్నా వైద్య సేవలు అందించడానికే ప్రాధాన్యం ఇస్తా' అని జిల్లా కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఐఎంఏహాల్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలడాక్టర్ల వర్క్‌షాపు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైద్య వృత్తికి, డాక్టర్‌కు సమాజంలో ఎంతో గౌరవం, గుర్తింపు ఉన్నాయన్నారు. అలాంటి డాక్టరు వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలని సూచించారు. ప్రైవేటు డాక్టర్లు నిబంధనలు పాటించి సేవలు అందించాలన్నారు. డాక్టర్ నిత్య విద్యార్థిగా ఉంటూ అధునాతన వైద్య విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు జూనియర్ డాక్టర్లకు ఎంతో ప్రయోజనమన్నారు. వైద్యవృత్తిని సేవాభావంతో నిర్వహిస్తూ పేదప్రజలకు వైద్యసేవలు అందించినపుడే డాక్టర్లకు ఆత్మసంతృప్తితోపాటు కీర్తిప్రతిష్టలు వస్తాయని పేర్కొన్నారు. వైద్య కళాశాల, కిమ్స్‌సవీరా, కేర్‌అండ్‌క్యూర్, జిల్లాఆస్పత్రులలోను ఈవర్క్‌షాప్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఐఎంఏరాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అనిల్‌కుమార్, రాష్ట్రకార్యదర్శి డాక్టర్ ఏఎస్‌కిరీటీ, జీజీహెచ్ పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ రవికుమార్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీకాంత్, బెంగళూరు డాక్టర్ ప్రతాప్‌చంద్ర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత పలువురు పీడియాట్రిక్స్ డాక్టర్లు పాల్గొన్నారు.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- గుంతల రోడ్లకు మరమ్మతులు
- చకచకా సాగుతున్న ప్యాచ్ వర్కులు
- వైసీపీ పాలనలో సర్వం ఛిద్రం


తారుతో ప్యాచ్‌లు వేస్తున్న దృశ్యం

కనగానపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో గుంతల రోడ్లకు మోక్షం లభిస్తోంది. ఐదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం ప్యాచ్ వర్కులకు కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంతోమంది ప్రమాదాలకు గురయ్యారు. అయితే ఇటీవల అధికార పీఠంపై కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ప్రజలు పడుతున్న ప్రయాణ ఇబ్బందులు తీర్చడానికి పూనుకుంది. మొదట గుంతలకు ప్యాచ్ వర్కులు చేపట్టింది. రోడ్డుకు ఇరు వైపులా పెరిగిన కంపచెట్లు తొలగించే పనులు చేపట్టింది. రాప్తాడు నియోజకవర్గంలో కనగానపల్లి, అనంతపురం సెక్షన్ కింద 11 రోడ్లను గుర్తించింది. ఇందుకు రూ.2.84 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ప్యాచ్ వర్కులు చక చకా జరుగుతున్నాయి. గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే భయంగా ఉండేదని, ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని పలువురు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కంకర తేలి అధ్వానంగా ఉన్న కనగానపల్లి-మామిళ్లపల్లి రోడ్డు

కనగానపల్లి సెక్షన్ రోడ్లు: కనగానపల్లి-చిగరచెట్లు, ఆత్మకూరు-కురాకులపల్లి, ఎన్. ఎస్‌గేటు-ధర్మవరం, ఎగువపల్లి-తగరకుంట, మామిళ్లపల్లి-భానుకోట

అనంతపురం సెక్షన్: అనంతపురం-తగరకుంట, సింగంపల్లి మెయిన్ రోడ్డు, మరూరు-రామినేపల్లి, ఈనాడు ఆఫీస్-చిగిచెర్ల, బొమ్మేపర్తి రోడ్లకు మరమ్మతులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.


గుంతల రోడ్లపై కంకర, వెట్ మిక్స్ వేస్తున్న కూలీలు

ప్రమాదాలు తగ్గుతాయి



దెబ్బతిన్న రోడ్లను బాగు చేయడం మంచిది. వర్షాకాలంలో గుంతల్లో నీళ్లు నిలబడటంతో లోతు తెలియక అందులో దిగిన వాహనదారులు చాలా మంది కిందపడి గాయపడ్డారు. కొందరు చనిపోయారు. రోడ్ల మరమ్మతులు చేయడం వలన చాలా వరకూ ప్రమాదాలు తగ్గుతాయి. ఇందుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునితకు కృతజ్ఞతలు.

- మనోహరనాయుడు, తల్లిమడుగుల

పనుల వేగవంతానికి కృషి

దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్క్ అవసరమున్న చోట లెంతీ పనులు చేస్తున్నాం. పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. మరమ్మతు పనులే గాక మరిన్ని రోడ్లకు ప్రతిపాదనలు పంపాం.

- హరిక, ఆర్‌అండ్‌బీ జేఈ

పప్పుశనగకు వేరుకుళ్లు..!

- నిలువునా ఎండిపోతున్న పంట
- ఆందోళనలో రైతులు


తెగులుతో ఎండిన పప్పుశనగ

యాడికి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన పప్పుశనగ పంట వేరుకుళ్ల తెగులుతో నిలువునా ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాడికి మండలంలోని ఎన్.కొత్తపల్లి, వేములపాడు, నగరూరు, భోగాలకట్ట, కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో సుమారు 2,500 హెక్టార్లలో పప్పుశనగ పంట సాగు చేశారు. వేరుకుళ్ల తెగులు మొదట పంటలో అక్కడక్కడ కనిపిస్తోందని రైతులు తెలిపారు. తెగులు సోకిన మొక్కలను తొలగిస్తున్నా పొలమంతా వ్యాప్తి చెందుతోందని దీంతో పంటంతా దెబ్బతింటున్నదని తెలిపారు. మందులు పిచికారి చేసినా తెగులు ఉధృతి తగ్గడం లేదన్నారు. తెగులు ప్రభావం ఇలాగే కొనసాగితే రబీలో సాగుచేసిన పప్పుశనగ పంట దిగుబడి కష్టమే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలను సూచించాలని రైతులు కోరుతున్నారు.


వేరుకుళ్ల తెగులు సోకిన పప్పుశనగ పంట

ఉన్నట్లుండి పంట ఎండుతోంది



పప్పుశనగ పంటలో మొక్కలు ఉన్నట్లుండి ఎండిపోతున్నాయి. మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. సాగుచేసిన పంటలో 40 శాతం పైగా మొక్కలు ఇలా ఎండిపోతున్నాయి. విత్తు సమయంలో విత్తనశుద్ధిచేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సలహాలు అందించాలి.

- జగదీష్, ఎన్.కొత్తపల్లి

అదుపులోకి రాని తెగులు



రబీలో ముందుగా సాగుచేసిన పప్పుశనగ పంటలో వేరుకుళ్ల తెగులు ఎక్కువగా ఉంది. మొదట పంటలో అక్కడక్కడ తెగులు కనిపించింది. అనంతరం పంట మొత్తం వ్యాప్తి చెందుతోంది. ఎన్నిమందులు పిచికారి చేసినా వేరుకుళ్ల తెగులు అదుపులోకి రావడంలేదు. తెగులు ప్రభావం ఇలాగే ఉంటే పంటను కోల్పోవాల్సి వస్తుంది.

- నాగమల్లేష్, ఎన్.కొత్తపల్లి

కేజీబీవీ పోస్టుల భర్తీలో అన్యాయం

- బాధిత అభ్యర్థుల ఆవేదన


బాధితులు మాధవి, కళావతి

అనంతపురం విద్య, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పోస్టుల భర్తీలో రోస్టర్ మార్చి, తమకు అన్యాయం చేశారని పలువురు అభ్యర్థులు వాపోయారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో కేజీబీవీల్లో ఖాళీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం పోస్టింగ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్‌లో పీజీటీ ఎంపీహెచ్‌డబ్ల్యూ పోస్టు ఓపెన్ కేటగిరీలో చూపించి, భర్తీ సమయలో బీసీ కేటగిరీ అభ్యర్థికి అవకాశం కల్పించారని అభ్యర్థి మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ అమలు చేయడంలో అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు. మరో అభ్యర్థి కళావతి మాట్లాడుతూ పీజీటీ- పీఎస్‌టీటీ ఒకేషనల్ పోస్టులు రెండింటిలో ఒకటి ఓసీ రోస్టర్‌కు, మరొకటి ఎస్సీ రోస్టర్ ఉండగా... ఓసీ రోస్టర్ అభ్యర్థులతోనే భర్తీచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈ విషయాలను సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులను అడిగితే ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు భర్తీ చేయగా ఆగిపోయిన తర్వాత రోస్టర్ ఆధారంగా పోస్టులు భర్తీ చేశామని చెప్పి తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ మంత్రికి దృష్టికి సైతం తీసుకెళ్తామని తెలిపారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఏర్పడిన ప్రయాణికుల రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. బెంగళూరు-బరౌనీ ప్రత్యేక రైలు (నం. 06563)ను ఈ నెల 12, 19 తేదీల్లో బెంగళూరులో రాత్రి 9-15 గంటలకు బయలుదేరి రెండు రోజుల తర్వాత 14, 21 తేదీలలో రాత్రి 8 గంటలకు బరౌనీకి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06564) ఈ నెల 15, 22 తేదీలలో సాయంత్రం 5 గంటలకు బరౌనీలో బయలుదేరి 17, 24 తేదీలలో సాయంత్రం 6 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూల్ సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, శాట్నా, ప్రయాగరాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బక్సర్, ఆర, దానాపూర్, పాటలీపుత్ర, హాజీపూర్, బచ్‌వారా స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. యశ్వంతపూర్-ముజఫర్ నగర్ ప్రత్యేక రైలు (నం 06229) ఈ నెల 13న యశ్వంతపూర్‌లో ఉదయం ఏడున్నరకు బయలుదేరి 15న ఉదయం 9-45 గంటలకు ముజఫర్‌నగర్‌కు చేరుతుందని, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06230) ఈ నెల 16న ఉదయం 10-45 గంటలకు ముజఫర్‌నగర్‌లో బయలుదేరి 18న ఉదయం 10-50 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, శాట్నా, ప్రయాగరాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బక్సర్, ఆర, దానాపూర్, పాటలీపుత్ర, హాజీపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

ధర్మవరం మీదుగా..

యశ్వంతపూర్-దానాపూర్ ప్రత్యేక రైలు (నం 06271) ఈ నెల 14, 21 తేదీల్లో (గురువారాలలో) ఉదయం ఏడున్నరకు యశ్వంతపూర్‌లో బయలుదేరి 16, 23 తేదీలలో (శనివారాలు) ఉదయం 6 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందని, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06272) ఈ నెల 17, 24 తేదీలలో (ఆదివారాలలో) ఉదయం 8 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి 19, 26 తేదీలలో (మంగళవారాలలో) ఉదయం పదిన్నరకు యశ్వంతపూర్‌కు చేరుకుంటాయని వివరించారు. ఈ రైలు ధర్మవరం, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, శాట్నా, ప్రయాగరాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బక్సర్, అర స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

గుత్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు, గుత్తి ఆర్ఎస్ ప్రాంతానికి చెందిన తనను సూరసింగన్నపల్లి కాలనీకి చెందిన గోవర్ధన్ తరచూ వేధిస్తున్నాడని ఆ మహిళ ఈనెల 5న పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న గోవర్ధన్ ఇంటి నుంచి పరారయ్యాడు. అనంతపురంలో బంధువుల ఇంట్లో తలదాచుకున్నట్లు తెలుసుకున్న పోలీసులు గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని గుత్తిపోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మొక్కేకదా అని వదిలేస్తే..


ఎస్కేయూ వద్ద హైవే బ్రిడ్జిపై పెరుగుతున్న రావి చెట్టు

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇక్కడ కనిపించే రావి మొక్క చూడటానికి బాగానే ఉంది. కానీ అది పెరిగే కొద్ది ప్రమాద అవకాశం కూడా ఎక్కువ అవుతుంది. ఎందుకంటే అది ఎక్కడో మైదానంలో పెరగడం లేదు. ఎస్కేయూ వద్ద ఉన్న అనంతపురం-కదిరి హైవే బ్రిడ్జికి ఏర్పాటు చేసిన దిమ్మెల మధ్య పెరుగుతోంది. ఈ మొక్క చెట్టుగా ఎదిగే క్రమంలో దాని వేర్లు బ్రిడ్జిలోకి పంపుతుంది. దీంతో బ్రిడ్జి దెబ్బతినే ప్రమాదం ఉంది. జాతీయ రహదారుల పర్యవేక్షణ అధికారులు పట్టించుకోకపోవడంతోనే పలు చోట్ల ఇలా మొక్కలు పెరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

సొంత పనులకు ప్రభుత్వ వాహనాలు

▸▸ ఏపీఎంసీ కార్యదర్శి తీరు...

బంగారపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తన పథకాల అమలుకోసం ఉద్దేశించిన వాహనాలను కొందరు అధికారులు విలాసవంతమైన జీవనంకోసం, వ్యక్తిగత ప్రయోజనాలకోసం ఉపయోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా పట్టణంలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ) కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది తీరు ప్రజలలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలి ప్రభుత్వ వాహనాన్ని ఇష్టం వచ్చినట్టు వినియోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏపీఎంసీ అధ్యక్ష పదవికి మూడేళ్లుగా ఎన్నికలు జరగలేదు. దీంతో అధ్యక్షుడికి కేటాయించిన వాహనాన్ని అక్కడి కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు కొంతమందికి క్వార్టర్స్ కేటాయిస్తారు, హెచ్ఆర్ఏ సదుపాయం ఉంటుంది. ఇక్కడి ఏపీఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ సర్వాధికారి తరహాలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన ప్రతిరోజూ బెంగళూరుకు రైలులో ప్రయాణిస్తారు. ఈ సందర్భంగా బంగారపేట రైల్వేస్టేషన్ శాఖకు కేటాయించిన ప్రభుత్వ వాహనానంలో రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. కార్యాలయానికి నిర్ణీత వేళలు ఉన్నా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండరని, సాయంత్రం వేళ గడువుకంటే ముందుగానే వెళ్తుంటారని తెలుస్తోంది. నిర్ణీత సమయానికి ఉండరని, డీసీ కార్యాలయం మీటింగ్, కోర్టు, బెంగళూరు హెడ్ ఆఫీస్ మీటింగ్‌లని పలు కారణాలు చెబుతూ వెళ్లడం సామాన్యంగా ఉందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక రిపబ్లిక్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిక్కనారాయణ మాట్లాడుతూ.. ఏపీఎంసీ పాలనాధికారిగా ఉన్న తహసీల్దారు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దారు వెంకటేశప్ప మాట్లాడుతూ ప్రభుత్వ వాహనాలు దుర్వినియోగం చేసినట్టు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



సిబ్బందిని పికప్ చేసుకునేందుకు వేచివున్న ప్రభుత్వ వాహనం

కళలను ప్రోత్సహించండి: వీక్షితగౌడ

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సంస్కృతిలో భాగమైన కళలు, కళాకారులను ప్రోత్సహించాలని ప్రముఖ మోడల్ వీక్షితగౌడ అభిప్రాయపడ్డారు. చిత్రకళాపరిషత్‌లో ఇండియన్ ఆర్టిజన్ బజార్‌ను శుక్రవారం ప్రారంభించారు. దేశంలోని భిన్నమైన కళలు, డిజైన్‌లతో వంద దుకాణాలు ఏర్పాటు చేశారని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 17వరకు ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.


కళాకృతులతో వీక్షితగౌడ

రోరిఖ్ కళాఖండాలు తరతరాలకు ఆదర్శం


కళాఖండాలను వీక్షిస్తున్న సభాపతి హొరట్టి

బెంగళూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోరిఖ్ కళాఖండాలు తరతరాలకు ఆదర్శమని విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి అభిప్రాయపడ్డారు. చిత్రకళాపరిషత్‌లో రోరిఖ్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. బసవరాజ హొరట్టి ప్రదర్శనను ప్రారంభించిన తర్వాత మాట్లాడుతూ రష్యాలో నికొలస్ రోరిఖ్ పెయింటర్‌గా, ఆర్కియాలజిస్ట్‌గా, ఫిలాసఫర్‌గా ప్రజాదరణ పొందారన్నారు. ఆయన చిత్రాలు నేటికీ అద్భుతం అనిపిస్తున్నాయన్నారు.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

జస్లోక్ ఆసుపత్రి డైరెక్టర్ పీఆర్ కృష్ణస్వామి

బెంగళూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక అంశాలపై అవగాహన పెంపొందింప చేసుకోవాలని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ కావాలని ముంబై జస్లోక్ ఆసుపత్రి డైరెక్టర్ పీఆర్ కృష్ణస్వామి తెలిపారు. రామయ్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'ట్రేస్ ఎలిమెంట్స్ ఇన్ మ్యాన్ అండ్ అనిమల్స్' అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎంఆర్ జయరాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి మాట్లాడుతూ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ నీల్ డిగ్రాసె టైసన్ అభిప్రాయం ప్రకారం సైన్స్‌కు అంతం లేదని, అన్నీ ఆరంభమే అన్నారు. పరిశోధనలవైపు అడుగు పెడితే నిరంతరంగా సాధించాలనే తపన పెరుగుతుందన్నారు. 150ఏళ్లక్రిందట కెమికల్ సైన్సెస్ ద్వారా ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. 1920లోనే కెమిస్ట్రీ పట్ల పరిశోధనలు జరిగాయని, సైన్స్‌లో నేర్చుకునేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో మన దేశంలో పెన్సిలిన్ ఇంజెక్షన్ లభించేది కాదని, విదేశాలనుంచి దిగుమతి చేసుకునేవారన్నారు. కానీ నాలుగేళ్లక్రితం ప్రపంచమే గడగడలాడిన కోవిడ్‌కు మనమే వ్యాక్సిన్ ఎన్నో దేశాలకు పంపామన్నారు. విదేశాలలో పరిశోధనలకు ఇచ్చేంతటి ప్రాధాన్యత మనవద్ద సాధ్యం కావడం లేదన్నారు. కార్యక్రమంలో అమెరికా పెన్‌స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సందీప్ ప్రభు, టీఎంఏ పేరెంట్ కమ్యూనిటీ ఛైర్మన్ క్సింగస్ లై, సిఎస్ఐఆర్ డైరెక్టర్ శ్రీదేవి సింగ్, గోకుల విద్యాసంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ ఎంఆర్ రామయ్య, అకడమిక్ అడ్వైజర్ కరిసిద్దప్పలు పాల్గొన్నారు. మూలాలు తెలుసుకునే విషయంలో కేవలం మనిషిపై మాత్రమే కాకుండా పరిసరాలపైనా ప్రభావం చూపుతుందని అంతర్జాతీయ సమీక్ష ఏర్పాటు చేయడం సంతోషకరమని గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం తెలిపారు.


సదస్సులో ముంబై జస్లోక్ ఆసుపత్రి డైరెక్టర్ పీఆర్ కృష్ణస్వామి తదితరులు

నూతన వంగడాలతో అధిక దిగుబడులు


వ్యవసాయ వస్తు ప్రదర్శనలో జిల్లా అధికారి రవీంద్ర తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు8(ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతికతను, ఉత్తమ వంగడాలను వినియోగించు కుని ఎక్కువ దిగుబడి సాధించడంతో పాటు మట్టి సారాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చిక్కబళ్లాపుర జిల్లా అధికారి పిఎన్ రవీంద్ర అభిప్రాయపడ్డారు. తాలూ కాలోని మళమాచనహళ్లి గామపంచాయతీ బసవా పట్టణలో బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం, చింతామణి పట్టు విశ్వ విద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన గ్రామీణ కృషి కార్యానుభవ కార్యక్రమంలో వ్యవసాయ వస్తు ప్రదర్శన 2024ను ప్రారంభించి మాట్లా డారు. ఇటీవలిరోజుల్లో అల్పావధిలో తక్కువ పెట్టుబడితో నూతన సాంకే తికత, ఉత్తమ వంగడాలతో మంచి దిగుబడి సాధ్యమవుతోందని ఇది ఆర్థికం గాను లాభదాయక మన్నారు. రసాయన ఎరువుల వాడకం పెరిగి భూమి సారవంతం క్షీణిస్తోందన్నారు. ఈ అంశాన్ని అన్నదాతలు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమికీటక నాశనులు వాడరాదన్నారు. సాధ్యమైన మేరకు సేంద్రీయ విధానాలు పాటించాలన్నారు. తద్వారా భూసారం క్షీణించడాన్ని నివారించడమే కాక దిగుబడులపై రసాయనాల ప్రభావం తగ్గుతుం దన్నారు. అలాగే నాట్లకు ముందు విత్తనశుద్ధి విధానాన్ని పాటించా లన్నారు. కులపతి డాక్టర్ ఎస్‌వి సురేశ్ మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్లాపుర ప్రాంత రైతులు యువ శాస్త్రవేత్తలకు దీటుగా సరికొత్త సాంకేతికత అమలుతో దిగుబడి సాధిస్తున్నారన్నారు. ఇదే సందర్భంగా ప్రదర్శనలోని వస్తువుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు బిఎన్ స్వామి, ఎన్నికల విభాగం అధికారి బికే శ్వేత, రైతుసంఘం రాష్ట్ర కార్యాధ్యక్షుడు భక్తరహళ్లి భైరేగౌడ, పట్టుగూళ్ల మార్కెట్ సహాయక డైరెక్టర్ తిమ్మరాజు పట్టుశాఖ అస్లాంపాషా పాల్గొన్నారు.

నవసమాజం దిశగా అడుగులు వేయాలి

బాగేపల్లి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో యువత పాత్ర కీలకంగా ఉందని దురలవాట్లకు లోనుకాకుండా నవసమాజం దిశగా అడుగులు వేయాలని తహసీల్దారు సిఖ్‌బతుల్లా అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని గుడిబండ పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో శుక్రవారం కన్నడ రాజ్యోత్సవంలో భాగంగా హబ్బ 2024 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొంతమంది యువత పలు కారణాలతో చట్టవ్యతిరేక కార్య కలాపాల్లో పాల్గొని జైలుశిక్ష అనుభవిస్తున్నారన్నారు. తద్వారా వారి తల్లిదండ్రులు, కుటుంబం ఎంతగా బాధ పడుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు సేవ చేయాల్సిన వారు పోకిరీలుగా చెడ్డపేరు తెచ్చుకుంటున్నారన్నారు. యువతలో తీరు మారాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని చోట్ల పిల్లలే తమ తల్లిదండ్రులను అనాథాశ్రమాలకు చేరుస్తున్న ఘటనలు వెలుగు చూశాయని, ఈధోరణి మారాల న్నారు. యువత చెడు అలవాట్లకు లోను కారాదని తద్వారా నవసమాజం సాధ్యయం కాదన్నారు. చక్కటి నడవడికతో తల్లిదండ్రులు, గురువులు, స్వగ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. దేశీయ కళలు, సంస్కృతిని నేర్చుకుని ఇతరులకు ఆదర్శంగా నిల వాలన్నారు. విద్యార్థి జీవనంలో దారి తప్పితే జీవితాంతం బాధపడాల్సి ఉంటుందనేది గుర్తుంచు కోవాలన్నారు. అలా కాకుండా జీవితాన్ని సార్థకత చేసుకునేలా ముందుకు సాగాలని హితవు పలికారు. కళాశాల కన్నడ ప్రాధ్యాపకులు డాక్టర్ కేఎం నయాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. అన్నివర్గాల వారు దినపత్రికలను కొనుగోలు చేసి చదువుతారని అయితే కన్నడిగులు మాత్రం ఇతర భాషలను మాట్లాడుతూ మాతృభాషను విస్మరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇతర భాషలను గౌరవిస్తూనే తొలి ప్రాధాన్య తగా మాతృభాషను ప్రేమించాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఇళ్లల్లో సిద్ధం చేసిన తినుబండారాలను ప్రదర్శించిన అనంతరం ఒకరికొకరు ఇచ్చిపుచ్చు కున్నారు. గుడిబండ కళాశాల ప్రిన్సిపాల్ అఫ్జల్ బిజలి, బాగేపల్లి ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నారాయణ, లైబ్రేరియన్ డాక్టర్ సీఎస్ వెంకటరామరెడ్డి, ప్రాధ్యాపకులు కృష్ణప్ప, శ్రీనాథ్, వినోదమ్మ, విజయకుమార్, కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు మంజునాథ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



హబ్బ 2024లో తహసీల్దారు తదితరులు

ఇతర రాష్ట్రాలవారు కన్నడ నేర్చుకోవాలి

మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, నవంబరు8(ఆంధ్రజ్యోతి): అన్ని పండుగలను ఆచరించే కర్ణాటకలో ఉన్న ఇతర రాష్ట్రాలవారు కన్నడను నేర్చుకోవాలని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. జనసహయోగ సంఘం ఆధ్వర్యంలో హూడిలోని సాదరమంగల చెరువు ఒడ్డున ఛట్ పూజా కార్యక్రమంలో సన్మానం స్వీకరించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఐటీబీటీ కంపెనీలు ఉండడంతో దేశవిదేశీయులు ఇక్కడ ఉన్నారన్నారు. వారి పండుగలు, సంస్కృతి సంప్రదాయాలను స్వాగతి స్తున్నామన్నారు. అదే రీతిన కన్నడభాషను నేర్చుకోవాలని సూచించారు. కాగా ఉత్తరభారత్‌లో ఛట్‌పూజ నిర్వహించే సంప్రదాయం ఉంది. స్థానికంగా ఉంటున్న ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందినవారు ఛట్ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు హూడి కబడ్డీ పిళ్ళప్ప, అశోక్‌రెడ్డి, భైరతి రమేశ్, జనసహయోగ్ సంఘం అధ్యక్షుడు బీర్ బహద్దూర్‌సింగ్, పదాధికారులు రాజేశ్‌కుమార్, సీతారాంయాదవ్, అజయ్ శర్మ, సంజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


ఛట్ పూజలో మాజీ మంత్రి అరవింద లింబావళి తదితరులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

దువ్వూరి రామిరెడ్డి (జయంతి)




'కవికోకిల'గా పేరొందిన దువ్వూరి రామిరెడ్డి 1895 నవంబరు 9న నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించారు. 23ఏళ్లకే ఎన్నో రచనలు చేశారు. స్వయంకృషితో అనేక భాషలలో పండితులు. పండితులచే 'సింహపురి సిరి'గా పేరొందారు. సంస్కృత, అరబిక్ భాషలనుంచి ఎన్నో పుస్తకాలను ఆంధ్రీకరించిన ఘనత ఆయనది. కవిగానే కాక విమర్శకులుగాను గుర్తింపు పొందారు. న్యాయవాదిగా, నాటక రచయితగా, 'చిత్ర నళీయం' సినిమా సృష్టికర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి. 'వన కుమారి' కావ్యం విజయనగర మహారాజు ఆస్థానంలో కావ్యస్పర్థలో ప్రథమస్థానంలో నిలిచింది. 1947 సెప్టెంబరు 11న కన్నుమూశారు.

కాళీపట్నం రామారావు (జయంతి)



'కారా మాస్టారు'గా పిలవబడే 'కాళీపట్నం రామారావు' 1924 నవంబరు 9న శ్రీకాకుళంలో జన్మించారు. సరళభాషా రచయిత, కథకుడు, విమర్శకుడు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. 2వేలకుపైగా కథల సంపుటాలు రచించి తెలుగు కథకు శాశ్వతత్వాన్ని చేకూర్చేదిశగా విశేష కృషి చేశారు. ఆంధ్రభూమి దినపత్రికలో 'నేటి కథ' శీర్షికతో కొత్త రచయితలకు అవకాశం కల్పించారు. 1966లో 'యజ్ఞం' కథ పాఠకుల మన్ననలు పొందింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, ఇతర గౌరవాలు పొందారు. 2021 జూన్ 4న కన్నుమూశారు.

శంకర్‌నాగ్ (జయంతి)



శాండల్‌వుడ్‌లో పేరొందిన నటుడు శంకర్‌నాగ్ (శంకర్ నాగరకట్టె) 1954 నవంబరు 9న ఉత్తర కన్నడ జిల్లా హొన్నావర తాలూకా మల్లాపురలో జన్మించారు. స్క్రీన్‌రైటర్‌గా, దర్శకుడిగా, నిర్మాతగా రాణించారు. బుల్లితెరపై ఆయన దర్శకత్వం వహించి నటించిన 'మాల్గుడి డేస్' ధారావాహిక ఎంతో పేరొందింది. అన్న అనంత్‌నాగ్‌తో కలసి నాటక, సినీరంగానికి ఎంతో కృషి చేశారు. 90కుపైగా సినిమాల్లో నటించారు. ఉత్తమ నటుడు అవార్డు గ్రహీత. కారు ప్రమాదంలో 1990 సెప్టెంబరు 30న దుర్మరణం చెందడం విషాదకరం.

ఆర్ వేదవల్లి (పుట్టినరోజు)



సంగీత కళానిధి, విదూషి ఆర్ వేదవల్లి 1935 నవంబరు 9న తమిళనాడు రాష్ట్రం మన్నార్‌గుడిలో జన్మించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీతాలాపనలో పేరొందారు. తిరుప్పావై, ప్రమాణం వంటి ఆల్బమ్స్ ఎంతో పేరొందాయి. ఆలిండియా రేడియోలో క్లాజికల్ మ్యూజిక్, లైట్ క్లాజికల్ మ్యూజిక్‌లో ప్రెసిడెంట్ అవార్డు పొందారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీలోనూ, ప్రభుత్వ సంగీత కళాశాలలోనూ బోధనలు చేశారు. సంగీత కళా శిఖామణి, దివ్యగాన ప్రవీణ, కళైమామణి, సంగీత చూడామణి తదితర పురస్కారాలు అందుకున్నారు.

బాలకృష్ణ ప్రసాద్ (పుట్టినరోజు)



సంగీత విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ 1948 నవంబరు 9న రాజమండ్రిలో జన్మించారు. గాయకుడిగా, కంపోజర్‌గా రాణించారు. 1978-2006 వరకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో స్పెషల్ గ్రేడ్స్ కళాకారుడిగా కొనసాగారు. 800కుపైగా అన్నమాచార్య కీర్తనలకు స్వరకల్పన చేశారు. కాగా ఇతరుల కవులు రాసిన సుమారు 1200 పాటలకు ట్యూన్స్ అందించారు. టీటీడీ, కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాన్‌గా రాణించారు. కర్ణాటక సంగీతం, లలిత సంగీతం, జానపద సంగీతంలో నిష్ణాతులు. సంగీత నాటక అకాడమీ, అన్నమయ్య నాదజ్యోతి, ఉగాది పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు.

వీణా గాయత్రి (పుట్టినరోజు)



తమిళనాడు మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి తొలి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించిన వీణా గాయత్రి 1959 నవంబరు 9న చెన్నైలో జన్మించారు. అసలు పేరు ఎచ్చంపాటి గాయత్రి. కర్ణాటక సంగీతంలో వీణావాదనలో పేరొందారు. ఆలిండియా రేడియోలో 13ఏళ్లకే సీనియర్ గ్రేడ్ గుర్తింపు పొందారు. దేశ విదేశాలలో కచేరీలు నిర్వహించారు. పలు ఆల్బమ్స్ రూపొందించారు. కళైమామణి, సంగీత కళా సారథి, సంగీత కళా శిఖామణి, జీవిత సాఫల్య పురస్కారం, మధ్యప్రదేశ్ ప్రభుత్వంచే కుమార గంధర్వ అవార్డు, ఇంకా గౌరవ డాక్టరేట్ పురస్కారాలు పొందారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

నగదు స్వాహాపై కేసు

గాండ్లపెంట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్డీటీ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో అకౌంటెంట్ నాగరాజు రూ. 21 లక్షల అవినీతి పాల్పడినట్లు ఆ సెంటర్ లీడర్ పద్మావతమ్మ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు... గాండ్లపెంట ఆర్డీటీ కార్యాలయంలో మహిళలకు వృత్తి శిక్షణలో భాగంగా బుక్‌బైండింగ్ వర్క్ చేసేవారు. సరుకు నిమిత్తం రూ.21 లక్షలకు చెందిన ఖాళీ చెక్కులపై ఒకేషనల్ మహిళ లీడర్లతో నాగరాజు సంతకాలు చేయించుకున్నారు. విజయవాడకు చెందిన జోగులాంబ ట్రేడర్స్ ప్రొపైటర్‌లో అతను కుమ్మకై సరుకు రాకుండానే చెక్కులను మార్చుకున్నారు. దీనిపై పద్మావతమ్మ ఫిర్యాదు చేయడంతో.. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రంగా తెలిపారు.

వసతి పాఠశాలలో కన్నడ రాజ్యోత్సవం

శిడ్లఘట్ట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని అప్పేగౌడనహళ్ళిలోని ఇందిరాగాంధీ వసతి పాఠశాలలో కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్‌ఏ ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నాడగీత అనంతరం విద్యార్థుల యక్షగాన ప్రదర్శన, కన్నడ భాష గొప్పదనాన్ని చాటే నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కర్ణాటక ఏకీకరణ జరిగి దశాబ్దాలు సాగినా మన వైభవం చాటేలా కార్యక్రమాలను నవంబరు నెలలో ఆచరించడం సంతోషంగా ఉందని ప్రసాద్ అభిప్రాయపడ్డారు. కన్నడ భాష, సంస్కృతి కళలను ప్రోత్సహించి భావితరాలకు అందించడంలో అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ మురళీధర, సిజె దివాకరరెడ్డి, శశిదీపికా, రామప్ప, సిద్ధప్ప, శివరాయి, కెపి త్రివేణి, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


కన్నడరాజ్యోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కుప్పకూలిన మూడు అంతస్తుల భవనం

బంగారపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన బంగారపేట పట్టణంలోని కుప్పస్వామి లేఅవుట్‌లో మూడు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. శుక్రవారం ఉదయాన్ని భవనం కూలగా అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం లేక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కుప్పస్వామి లేఅవుట్‌లోని రోడ్డులో బూదికోటె రాజ్‌కుమార్‌కు చెందిన 3 అంతస్తుల భవనం కూలిపోయింది. భవనంలో ఉంటున్న ముగ్గురు కుటుంబ సభ్యులు ప్రాణాలతో బయటపడ్డారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న గోడను బాగు చేసేందుకు పనులు చేపట్టిన వేళ పైన భవనం ఒక్కసారిగా కుంగింది. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని ఇళ్లలో ఉన్నవారిని క్షేమంగా బయటకు దించేశారు. భవనం పూర్తిగా ఎడమవైపునకు ఒరిగి కొద్దిసేపు అనంతరం క్రమంగా కూలిపోయింది. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి, పట్టణ పోలీసులు పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వ్యక్తి మరమ్మతులు చేపడుతున్న వేళ భవన యజమాని సరైన పర్యవేక్షణ చేయకపోవడమే ఘటనకు కారణమని తెలుస్తోంది.


కూలిపోతున్న భవనం

శ్మశానానికి వెళ్లేందుకు ఇక్కట్లు


శ్మశానానికి వెళ్లే కాలిబాటలో నిర్మాణ వ్యర్థాలు ఇలా..

బాగేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 23వ వార్డులు ఉండగా స్మశానానికి వెళ్లే మార్గం కూడా సమస్యల వలయంలో ఉంది. నేత్రావతి నది పక్కన ఉన్న రోడ్డు మార్గంలో వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మృతదేహాన్ని సాగించేందుకు వీలులేకుండా రోడ్డుమధ్యలో ఒకచోట ఇంటి నిర్మాణ వ్యర్థాలు, చెత్తా చెదారం పడేశారు. పట్టణంలో సుమారు 22వేల జనాభా ఉంది. చిత్రావతి నదికి అనుబంధంగా స్మశానం ఉండగా పట్టణంలోని వాల్మీకి, అంబేడ్కర్‌నగర్, సంత మైదానం, గూళూరు రోడ్డు, కంచుకోట తదితర వార్డులనుంచి కిలోమీటరు దూరంలో కాలిబాట ఉంది. సదరు కాలిబాట కూడా సజావుగా లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్మశానానికి వెళ్లే మార్గంలో కనీస వ్యవస్థ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. పురసభ ఏటా స్మశానాల అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తున్నట్టు ప్రకటించినా ఆచరణలో విఫలమైందనే విమర్శలున్నాయి. రోడ్డు పొడవునా గుంతలు ఉండి కంకరతేలి ఉంది స్మశానానికి వెళ్లే మార్గం ఎప్పుడు బాగవుతోందనని ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

బంగారపేట సీఐ నంజప్ప సస్పెన్షన్

బంగారపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను కాపాడడంలో విఫలమైన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం నంజప్ప, సహాయక ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రెడ్డిలను విధులనుంచి సస్పెండ్ చేసినట్టు సెంట్రల్ డివిజన్ ఐజీపీ లాబూరామ్ ఆదేశించారు. గతనెల 28వ తేదీ రాత్రి గస్తీలో ఉన్న మహిళా ఏఎస్సై ఫరీదాబానుపై దుండగులు దాడి చేశారు. ఘటనపై 29న బంగారపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మహిళా ఏఎస్సైపై ప్రాణాంతక దాడి చేసిన అజయ్‌సింగ్ స్థానిక బస్టాండ్ వద్ద గొడవ చేస్తున్నట్టు తెలుసుకున్న పోలీసులు అతడిని స్టేషన్‌కు తరలించారు. ఆ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ఏఎస్సై శివశంకరరెడ్డి ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ నంజప్పకు సమాచారం అందించారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినా సరైన స్పందన లేకపోయింది. విధి నిర్వహణలో ఉన్న ఏఎస్ఐ ఫరీదాబాను గాయపడేందుకు కారణమై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణా చర్యలకింద సస్పెండ్ చేసినట్టు ఐజీపీ ప్రకటించారు. నంజప్ప, శివశంకరరెడ్డిలను సస్పెండ్ చేశారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,605.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,536	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,116	9,052
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	29.76

తాయమ్మదేవికి పూజలు

సిరుగుప్ప, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలసిన తాయమ్మదేవికి కార్తీక శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మహామంగళహారతికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.



అలంకరణలో తాయమ్మదేవి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజలందుకుంటున్న బన్నిమహంకాళమ్మదేవి

కంప్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బళ్లారి రోడ్డు హౌసింగ్ బోర్డులో బన్నిమహంకాళమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుక్కసాగర కరే సిద్దేశ్వర విశ్వారాధ్య స్వాములు పాల్గొన్నారు. అమ్మవారితో పాటు మహాగణపతి, ఈశ్వర, నంది, నాగదేవత, తదితర విగ్రహాల ప్రతిష్ఠ చేపట్టారు. ఉదయం అమ్మవారి కలశాలతో ఊరేగింపు చేపట్టారు. గణపతి హోమం, ఉమామహేశ్వర హోమం, చండీ హోమం, తదితర పూజలు చేపట్టారు. భక్తులకు దేవస్థానం కమిటీ సభ్యులు అన్నప్రసాదం అంజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రామదాసు, ఉపాధ్యక్షుడు ఉమేష్, కార్యదర్శి చెన్నబసయ్య స్వామి, రాఘవేంద్ర, రవి, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు రేబిస్ టీకా

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యాప్తంగా మేకలు, గొర్రెలకు ఈనెల 11నుంచి నెలపాటు ఆటుకోళి రేబిస్ వ్యాధి నియంత్రణకు టీకాలు వేయనున్నారు. కృష్ణగిరి జిల్లాలో 2,79,600 మేకలు, గొర్రెలు ఉన్నాయని, పశుసంవర్ధక శాఖ ద్వారా వరుసగా 30 రోజుల పాటు టీకాలు వేయనున్నారు. ప్రతి గ్రామంలో సంబంధిత రీజినల్ అసిస్టెంట్ వెటర్నరీ అధికారి నేతృత్వంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేస్తారు. 4 నెలల పైబడిన గొర్రెలు, మేకలకు టీకాలు వేయవచ్చునని కలెక్టర్ సరయు ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

రాయచూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ పట్టణ సమీపంలోని అమదిహాళ్ గ్రామంలో నిర్వహిస్తున్న వేశ్యావాటికపై పై పోలీసులు శుక్రవారం దాడి జరిపారు. గత కొంతకాలంగా ఈ గ్రామంలోని ఒక ఇంట్లో వేశ్యాగృహం నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న మస్కి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బాలచంద్ర తన సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశారు. దాడిలో ఇద్దరికి అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా ఒక అద్దె ఇంట్లో నివాసముంటూ వీరిద్దరు వేశ్యావాటిక నిర్వహిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. కాగా దాడిలో పట్టుబడిన కొంతమంది బాధిత మహిళలను స్వాంతన కేంద్రాలను తరలించినట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బాలచంద్ర తెలిపారు. ఇందుకు సంబంధించి లింగసుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఒత్తిళ్లను అధిగమిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా న్యాయాధికారి జె.శాంతి

బళ్లారి సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒత్తిళ్లను అధిగమించి, మానసిక ప్రశాంతత సాధిస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధిస్తామని జిల్లా మరియు సెషన్స్ న్యాయాధికారి శాంతి పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికారి సంస్థ, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వమించిన 'మనసు-ఆరోగ్య ప్రపంచం' సదస్సును శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనస్సును నియంత్రణలో ఉంచుకుంటే మానసిక ఆరోగ్యం సాధ్యమన్నారు. పని ఒత్తిళ్లను అధిగమించి వ్యక్తిగత జీవితాన్ని కాపాడుకోవాలన్నారు. దృఢమైన శరీరాన్ని కలిగి ఉండటానికి వ్యాయామం, క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు యోగా, ధ్యానం సాధన చేయాలన్నారు. జిల్లా ఆసుపత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ రోహన్ వానగుండి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని 1985లో బళ్లారిలో నిమాన్స్ సహకారంతో ప్రారంభించామన్నారు. మనిషి భావోద్వేగాలను సమదృష్టితో స్వీకరించి మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెషన్స్ కోర్టు మొదటి అదనపు న్యాయాధికారి విద్యాధర శిరహట్టి, జిల్లా కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి సిద్దలింగ ప్రభు, జిల్లాన్యాయసేవాధికార సంస్థ మెంబరు రాజేష్ హొసమనె. సివిల్ జడ్జీ ఇబ్రహీం ముజావర్, అర్వాన్ వివిధ జిల్లా కోర్టు న్యాయాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి శాంతి

అభివృద్ధిలో ఆస్తిపన్నే కీలకం: మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీష్

బళ్లారి సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి ఆస్తి పన్ను ప్రధాన ఆధాయమని మేయర్ ముల్లంగి నందీష్ అన్నారు. శుక్రవారం బళ్లారి జిల్లా వాణిజ్య, పరిశ్రమల సమాఖ్యలో ఆస్తి పన్ను వసూళ్ళు, మౌలిక సదుపాయాలు, ప్లాస్టిక్ వినియోగం, ఇతర అంశాలపై పారిశ్రామిక వేత్తలు-వ్యాపారుల సమక్షంలో ఆయన ప్రసంగించారు. పారిశ్రామిక రంగంలో మౌలిక వసతుల సమస్యలున్నాయన్నారు. రోడ్లు,వీధిలైట్లు, తాగునీటి సరఫరా సహా అనేక సమస్యలు మున్సిపల్ కార్పొరేషన్ దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి పారిశ్రామికవేత్తలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. పారిశ్రామిక వాడలో వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, తాగునీరు ధూళి తదితర అంశాలను ప్రస్తావించారు. డిప్యూటీ కమిషనర్ అబ్దుల్ రెహమాన్ స్వయం ప్రకటిత ఆస్తిపన్ను ఆన్‌లైన్ చెల్లింపు గురించి వివరించారు.ఈసందర్భంగా మహానగర పాలక సభ్యుడు రామాంజనేయులు, బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం ఉపాధ్యక్షులు దొడ్డనగౌడ్, సంయుక్త కార్యదర్శి మర్చెడ్ మల్లికార్జునగౌడ్, మాజీ అధ్యక్షుడు మహారుద్రగౌడ్,కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్ గుప్తా, బద్రీనారాయణ, రాజేశ్, వాసుదేవ, శ్రీనివాస్‌రావు, నేకర నాగరాజ్, హేలీస్ బ్లూ, శివమూర్తి , వివిధ సంస్థల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

'కిల్కారి'తో గర్భిణుల సంరక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ శ్వేత

బళ్లారి సిటీ, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): నాలుగు నెలలు పైబడిన గర్భిణులు, ఏడాది లోపు పిల్లల సంరక్షణలో కుటుంబ సభ్యులకు సహాయం చేసేందుకు 'కిల్కారి' ప్రోగ్రాం ఉపయోగకరమని డాక్టర్ శ్వేత పేర్కొన్నారు. నగరంలోని జిల్లా లసిక భవన్‌లో జిల్లా పాలనాధికారి జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఆశా సూపర్‌వైజర్లు, గ్రామీణ ప్రాంతాల్లోని ఆశా ఫెసిలిటేటర్లకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. గత అక్టోబరులో ఆమలు చేసిన కిల్కారి కార్యక్రమం కింద ప్రతి వారం ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన గర్భిణులు, కుటుంబ సభ్యుల మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. తల్లిదండ్రులను మొబైల్ నంబర్ 0124-4588000 ద్వారా సంప్రదించి మాట్లాడుతారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి కుటుంబ సభ్యులు సహకరించాలన్నారు. జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప మాట్లాడుతూ గర్భిణీ అని తెలిసిన రోజు నుంచి మదర్‌కార్డు అందజేసి నెలనెలా పరీక్షలు, ఉచిత మందులు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆరోగ్య విద్యా శాఖాధికారి ఈశ్వర హెచ్ దాసప్పనవర్, జిల్లా వీహెచ్‌ఎస్ఎస్‌సీ కోఆర్డినేటర్ రాఘవేంద్ర, జిల్లా ఆశా కోఆర్డినేటర్ ఆశా ప్రేమలత,రాఘవేంద్ర , అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ మహాదేవి, తాలూకా ఆశా సూపర్‌వైజర్లు నేత్ర, సుజాత,రేణుక తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల నమోదు ప్రారంభం

రాయచూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ-శ్రమ పేరుతో అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించే నమోదు ప్రక్రియను శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రారంభించారు. గతంలో కుటుంబ ఆహార కార్డు కోసం దరఖాస్తు చేస్తుకున్న అసంఘటిత వలయంలోని కార్మికులు ఈ-శ్రమ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకున్న వారికి రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో గతంలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా వారిని కార్యాలయానికి రప్పించి కార్డులను అందజేస్తామన్నారు. జిల్లాలో ఈ-శ్రమ ద్వార దరఖాస్తులు అందే లబ్దిదారుల సంఖ్య 7,502గా ఉన్నట్లు అధికారులు తెలిపారు.



సబ్ డైరెక్టర్‌తో చర్చిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

'పది'లో మెరుగైన ఫలితాలు రావాలి

● క్షేత్ర శిక్షణాధికారి చంద్రశేఖర్ భండారి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఈఓ చంద్రశేఖర్ భండారి

రాయచూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేయాలని క్షేత్ర శిక్షణాధికారి చంద్రశేఖర్ భండారి సూచించారు. శుక్రవారం నగరంలోని స్టేషన్ బజార్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల మేరుగు తదితర అంశాల పై ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన చంద్రశేఖర్ బండారి, గత ఏడాది తాలూకాలోని వివిధ గ్రామీణ ప్రాంతాలతో సహ నగరంలోని పలు పాఠశాలల్లో ఫలితాల శాతం తక్కువగా ఉండడాన్ని ప్రస్తావించారు. ఆ చరిత్ర పునరావృతం కాకుండా ఈ ఏడాది ఫలితాలు మెరుగు పడేందుకు ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌లు ప్రణాళిక భద్ధంగా విద్యార్థులను సమాయత్తం చేయాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రుల నుంచి తగిన సహకారం పొందేలా వారితో సమావేశం నిర్వహించాలన్నారు. అదే సమయంలో విద్యార్థులకు అన్ని సబ్జెక్టులో సిలెబస్‌ను పూర్తి చేయడంతో పాటు వారి అభ్యాసన సామర్థ్యం ఏ మేరకు ఉందో పరీక్షించేందుకు ఎప్పటి కప్పుడు స్లిప్ టెస్టులు ఇతరత్ర నిర్వహించి వారిని వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు ● 25 బైక్‌లు స్వాధీనం



ఎర్రగుంట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మోటార్ బైక్‌లను దొంగతనం చేస్తూ వాహన దారులకు, పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్న నలుగురు అంతర్‌రాష్ట్ర దొంగలను వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సీఐ నరేష్‌బాబు కథనం మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లెకు చెందిన మొలక గురివిరెడ్డి, బొద్దుబోయిన నాగేష్, అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన షేక్ చిన్న హాజీబాష, పెద్దపప్పూరుకు చెందిన షేక్ ఇమాం హుస్సేన్‌లు చెడు అలవాట్లకు, విలాసాలకు అలవాటు పడి బైక్ దొంగత నాలకు పాల్పడేవారు. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, గుత్తి, గుంతకల్, డోన్, విజయవాడ, ధర్మవరం, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఖరీదైన మోటార్ బైక్‌లను చోరీ చేసే వారు. ఈనేపథ్యంలో నిందితులు ఎర్రగుంట్ల మండలంలోని పొద్దుటూరు రోడ్డు రామాంజనేయపురం క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఉండ గా అదుపులోకి తీసుకుని.. విచారించగా మొత్తం వ్యవహారం బయట పడిందని సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 25 మోటార్ బైక్‌లను స్వాధీ నం చేసుకున్నామమని.. వీటి విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని తెలిపారు. బైకు దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన ఎర్రగుంట్ల సీఐ పి.నరేష్‌బాబు, ఎస్ఐ నాగమురళి, ఏఎస్ఐ గురుశంకర్, హెడ్‌కాని స్టేబుల్ ఆల్‌ఫ్రెడ్, పోలీసు సిబ్బందిని ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీలు అభినందించారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి : డీసీ



కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో ప్రకటనల జారీకి అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో సూచించారు. సండూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ 13న జరగనుంది. అభ్యర్థులు, సంస్థలు దినపత్రికల్లో ఎలాంటి ప్రకటనలైనా ప్రచురించాలంటే తప్పనిసరిగా జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎఎంసీ) నుంచి ముందస్తు అనుమతి పొందాలని అయన తెలిపారు. ప్రతిరోజు వివిధ మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలపై అధికారులు నిఘా పెడతారన్నారు. అనుమతి లేకుండా ఎలాక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, టీవీ, రేడియా తదితర వాటిలో ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవన్నారు.

మద్యం అమ్మకాలపై నిషేధం

బళ్లారి సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సండూరు అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా నియోజకవర్గ పరిధిలో మద్యం అమ్మకాలపై నిషేదం విధించారు. ఈ నెల 12న సాయంత్రం 6గంటల నుంచి 13 వ తేదీ సాయంత్రం 6గంటల వరకు సండూరుకు ఆనుకుని ఉన్న హొస్పేట్, కూడ్లిగి పరిధిలో 5.కి.మీ మేర వరకు మద్యం అమ్మకాలను నిషేధించినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.దివాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. బార్ అండ్ రెస్టారెంట్లు, క్లబ్‌లు, హోటళ్లు, డాబాలు, ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో మద్యం తయారీ, రవాణా, అమ్మకాలు చేపట్టరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

డెంగీ నియంత్రణకు సహకరించాలి : ఎమ్మెల్యే



నగరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ అధికారులు

బళ్లారి సిటీ,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దోమ కాటు ద్వారా వ్యాపించే డెంగీ వ్యాధిని అరికట్టేందుకు వైద్యారోగ్యశాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని సిటీ ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడీస్ దోమల నిర్మూలన దినోత్సవం (సూపర్ ఫ్రైడే) నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని గాంధీనగర్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాధుల నియంత్రణ విభాగం డెంగీ నియంత్రణకు విశేషంగా కృషి చేస్తోందన్నారు. ప్రజలు పరిశుభ్రత పాటించి దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డెంగీ జ్వరాన్ని అంటువ్యాధి చట్టం కింద తీసుకొచ్చిందని, ఏడీస్ దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే రూ. 200 జరిమానా విధిస్తామన్నారు. కళ్ల ఎర్రబడడం, కళ్లవెనుక నొప్పి, వాంతులు, దురద, తలనొప్పి, కీళ్లనొప్పులు, కండరాల్లో నొప్పులు, వంటి డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స పొందాలన్నారు. ఈసందర్భంగా జిల్లా అంటువ్యాధుల నియంత్రణ అధికారి డా.అబ్దుల్లా, జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వరదాసప్పనవర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి : కేంద్ర మంత్రి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జోషి

తోరణగల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దేశం కానీ, రాష్ట్రం కానీ అభివృద్ధి చెందాలంటే బీజేపీ పాలనతోనే సాధ్యమని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. శుక్రవారం కురేకుప్ప పట్టణంలో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతు తరపున ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ సండూరు పట్టణంలో గానీ, పల్లెల్లో గానీ కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఐదు గ్యారెంటీ పథకాలు ఇచ్చారని, కానీ అవి సరిగా అమలు కావడం లేదన్నారు. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం అయ్యిందని వాళ్లు ఏమీ గానీఅభివృద్ధి చేశారో చెప్పాలని, వాళ్లకు అనుకూలమైన వారికే స్థలాలు ఇస్తున్నామన్నారు. కానీ పేదలకు ఎటువంటి స్థలాలు అందలేదన్నారు. వక్ఫ్ భూమల కోసం పేదలను బలి చేయడం తగదన్నారు. రాష్ట్రం అన్ని విధాలా ఆర్థిక ఇబ్బందుల్లో వుందని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి కంకణ బద్ధులై ఉన్నామని పేర్కొన్నారు. బంగారు హనుమంతప్పను తప్పకుండా గెలిపించాలని, ఒకసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతు, బీజేపీ ప్రముఖులు భైరెటు బసవరాజు, జేడీఎస్ తాలుకా అధ్యక్షులు ఎస్ సోమప్ప గ్రామ ప్రముఖులు, బీజేపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

హోసూరు క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): హోసూరు వికాస్ నగర్ ప్రాంతంలో గురువారం రాత్రి ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరునల్వేలి నుంచి బెంగళూరు వెళ్తున్న దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు ఒడిగట్టాడు. ఎస్పీ రమేశ్ నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం దర్యాప్తులో విరుదునగర్ జిల్లా శాతనూరుకు చెందిన కూడలింగం(25)గా గుర్తించారు. స్థానికంగా హోసూరులోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. స్నేహితులతో కలిసి వికాస్ నగర్‌లో ఉంటున్నట్లు తెలిసింది. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్

హోసూరు నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బేలగొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన పాఠశాల భవనాన్ని జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తళి నార్త్ యూనియన్ కార్యదర్శి యూనియన్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యవర్గ సభ్యుడు గిరీశ్, బృందావన్ స్కూల్, కర్మాగార అధ్యక్షుడు శేఖర్, యూనియన్ కమిటీ మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, యూనియన్ కమిటీ సభ్యులు ప్రభాకర్, నారాయణస్వామి, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షులు ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

104 తరగతి గదులు ప్రారంభం

● వర్చువల్‌గా సీఎం శ్రీకారం ● కృష్ణగిరి జిల్లా కేంద్రంలో ప్రారంభించిన కలెక్టర్



తరగతి గదులను ప్రారంభిస్తున్న కలెక్టర్ సరయు తదితరులు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో నాబార్డు ప్రాజెక్టు కింద రూ.20.31 కోట్లతో నిర్మించిన 104 తరగతి గదులను తమిళనాడు సీఎం స్టాలిన్ వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. విద్యాశాఖ ద్వారా శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో జిల్లా కేంద్రంలో కలెక్టర్ సరయు స్వయంగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కృష్ణగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.4.655 కోట్లతో నిర్మించిన 22 తరగతి గదులను కలెక్టర్ కే.ఎం.సరయు, బర్గూరు ఎమ్మెల్యేలు ప్రారంభించారు. పాఠశాల విద్యాశాఖ తరపున కృష్ణగిరి పంచాయతీ యూనియన్ పరిధిలోని మోరనపల్లి, కృష్ణగిరి మున్సిపాలిటీ, బర్గూరు పంచాయతీ యూనియన్ పరిధిలోని మల్లపప్పాడి, వేపనపల్లి పంచాయతీ యూనియన్ పరిధిలోని కురుబరపల్లి, శూలగిరి పంచాయతీ యూనియన్ పరిధిలో అడ్డగురిక్కి , కట్టిగానదొడ్డి, ఎణుసోనై, తళి, బేలగొండపల్లి, బాలతోటనపల్లి, ఊత్తంగరై పంచాయతీ యూనియన్, మిట్టపల్లి, మద్దూరు పంచాయతీ యూనియన్ పరిధిల్లోని గున్నత్తూరు, కావేరిపట్టణం పంచాయతీ యూనియన్ పరిధిల్లోని నాగరసంపట్టి ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాబార్డు పథకం క్రింద 104 తరగతి గదులు, 1 ప్రయోగశాల నిర్మించారు. కార్యక్రమంల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్వామినాథన్, పరిటా నవాబ్, కృష్ణగిరి మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షులు సావిత్రి కడలరసుమూర్తి, తళి యూనియన్ కమిటీ అధ్యక్షురాలు సీనివాసులురెడ్డి , జిల్లా కమిషనర్ వళర్మతి, పేరెంట్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షురాలు నవాబ్, పాఠశాల ప్రిన్సిపాల్ మహేంద్రన్ నగర కౌన్సిల్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

● ప్రియురాలికోసం వచ్చి విద్యుత్తు తీగలకు కర్ణాటకవాసి బలి



శరవణ (ఫైల్)

కుప్పం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కర్ణాటకవాసి ప్రాణాలు తీసింది. ప్రియురాలికోసం అర్ధరాత్రి అడ్డదారిలో బయలుదేరిన అతన్ని అడవిపందుల నుంచి రక్షణకోసం ఉంచిన విద్యుత్తు తీగలు కాటేశాయి. శవాన్ని చూసి భయంతో బిగుసుకుపోయిన పొలం యజమాని చేతుల్లో దిక్కుమొక్కులేని స్థితిలో భూస్థాపితమైపోయాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తాలూకా దోనిమడుగు గ్రామానికి చెందిన శరవణ (40)కు, కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం కోడిగానిపల్లెకు చెందిన లలితకు సుమారు పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. కొన్నాళ్ల తరువాత శరవణ భార్య సమీప బంధువు ఒకరితో సంబంధం పెట్టుకున్నాడు. అప్పుడప్పుడూ ఆమెకోసం భార్యకు తెలియకుండా అత్తవారి గ్రామమైన కోడిగానిపల్లెకు రహస్యంగా రాకపోకలు సాగించేవాడు. ఈ క్రమంలో ఈనెల 4వ తేదీన దోనిమడుగునుంచి కారులో కోడిగానిపల్లెకు అడ్డదారిలో బయలుదేరాడు. ఊరికి కొద్దిదూరంలో కారును పార్క్ చేసి, కాలినడకన పొలాలమీదుగా గ్రామం చేరుకోవడానికి బయల్దేరాడు. కోడిగానిపల్లెకు చెందిన రామకృష్ణ పొలంలో వస్తుండగా అడవి పందులనుంచి రక్షణకోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగి విద్యుదాఘాతానికి గురైన శరవణ అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం పనుల నిమిత్తం కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న శరవణ మృతదేహాన్ని చూసి తనమీద కేసవుతుందని భయపడ్డాడు. దీంతో అతను శరవణ మృతదేహాన్ని రెండో కంటికి తెలియకుండా పొలం సమీపంలో గల పేడదిబ్బలో పూడ్చిపెట్టాడు. అయితే శరవణ ఎక్కివచ్చిన కారు గురించి మరిచిపోయాడు. గ్రామానికి సమీపంలో మూడునాలుగు రోజులుగా కారు పార్క్‌చేసి ఉండడం గ్రామస్థులు గమనించారు. వారిలో కొందరు ఆ కారును తమ ఊరి అల్లుడు శరవణదిగా గుర్తించి అనుమానంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కారును తీసుకొచ్చి స్టేషన్‌లో ఉంచారు. దీంతో తన నేరం ఎలాగూ బయటపడుతుందని భావించిన రామకృష్ణ శుక్రవారం పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. విద్యుత్తు తీగలు తగిలి శరవణ మృతి చెందిన విషయం వాస్తవమేనని గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అనుమానుతుడు రామకృష్ణపై కేసు నమోదుచేశామన్నారు. శనివారం శరవణ శవాన్ని వెలికితీసి పోస్టుమార్టంకోసం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తామని చెప్పారు.